# భారత్‌ను శక్తిమంతమైన దేశంగా మలుచుకుందాం!

## సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**రేపల్లె, న్యూస్‌టుడే** భారత్‌ను శక్తివంతమైన దేశంగా మలుచుకుందామని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. రేపల్లె ఎంసీఏ మందిరంలో మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులు, గురువులు, తల్లిదండ్రులు తమ బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరిస్తే అది సాధ్యపడుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డబ్బు సంపాదన ముఖ్యం కాదని, ఉన్నదానితో సంతృప్తి చెందితే



భానుతేజను అభినందిస్తున్న లక్ష్మీనారాయణ

సమస్యలుండవన్నారు. విశ్వవిజేత అలెగ్జాండర్ చనిపోతూ ఏమీ తీసుకెళ్లడం లేదనే సందేశాన్నిస్తూ తన రెండు చేతులని బయటికి కనుపించేలా పెట్టమన్నాడని ఆయన వివరించారు. లాల్‌బహదూర్‌శాస్త్రి, ఏపీజే అబ్దుల్‌కలాంలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అతి పేదరికం నుంచి ఉన్నత స్థానాలకు చేరుకున్నవారే మనకు ఆదర్శం కావాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అందించేలా లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఏదొకటి చేయాలన్న తపన ఉండాలన్నారు. ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ గురువులు విద్యార్థులకు మానసికంగా దగ్గర కావాలన్నారు. తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ రోజులో ఒకసారైనా కలిసి భోజనం చేయాలన్నారు. అప్పుడే తమపట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతున్నారని పిల్లలు భావిస్తారని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగులు విధులను తపస్సులా చేయాలని, పెద్దలు ఎవరింటికైనా వెళ్లేటప్పుడు మిఠాయిలకు బదులుగా మంచి పుస్తకాలు తీసుకెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 40వ ర్యాంకు సాధించిన భానుతేజను, అతని తండ్రి వెంకటేశ్వరరావును మాజీ జేడీ అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, ప్రవాసాంధ్రులు పర్చూరి శ్రీనాథ్, ఎంసీఏ సభ్యులు డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, డాక్టర్ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ వసంతం భాస్కరరావు, కన్నెగంటి రమేష్, రత్నాకరరావు, బాపారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### 2020 నాటికి అవినీతి అంతం

అవినీతి అంతం మన చేతుల్లోనే ఉందని, మన విధులు సక్రమంగా నిర్వర్తిస్తే అవినీతి దానికదే అంతమవుతుందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమం చివర్లో సభికులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. అందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న అవినీతి 2020 కల్లా అంతం అవుతుందా అని ప్రశ్నించారు. అందుకు లక్ష్మీనారాయణ సమాధానమిస్తూ ప్రతి వ్యక్తి తన న్యాయమైన సంపాదనతో తృప్తి చెందాలన్నారు. ఆచార్యునిగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. రూ.కోటి లంచమిచ్చినా పుచ్చుకోని విధంగా వారిని రూపొందించాలని, ఎవరికి వారు నూరు శాతం విధులు పూర్తి చేస్తే 2020 లోపే అవినీతి అంతమవుతుందన్నారు. సీబీఐపై అభియోగాలు మోపుతున్నప్పుడు ఎందుకు ప్రతిఘటించలేదని వి.కోటేశ్వరరావు ప్రశ్నించారు. అందుకాయన స్పందిస్తూ టైటానిక్, అవతార్ చిత్రాల నిర్మాతను ఎందుకంత సమయం తీసుకుంటున్నారని పలువురు విమర్శలకు ఆచిత్రాల విజయాలే సమాధానం చెప్పాయన్నారు. అలాగే తాను ప్రతిదానికీ సమాధానం చెప్పాల్సిన పని లేదన్నారు. వచ్చే ఫలితాలే సమాధానంగా నిలుస్తాయన్నారు. ఒక రైతు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ దేశానికి రైతు వెన్నుముకలాంటి వాడని తెలిపారు. అయితే నేడు గ్రామాల్లో వృద్ధులు తప్ప యువ రైతులు కానరావడం లేదన్నారు. వ్యవసాయ విజ్ఞానం పొంది ఆధునిక రైతుగా మారాలన్నారు. ఒక విద్యార్థి ప్రశ్నకు సమాధానంగా తనకు తల్లి, తండ్రి, గురువులే స్ఫూర్తి ప్రదాతలని తెలిపారు. అయితే పుస్తకాల ద్వారా వివేకానందుడు, అబ్దుల్‌కలాం ఆదర్శంగా నిలిచారన్నారు. ఒత్తిడిని జయించడమెలా అన్న విద్యార్థి సందేహానికి జవాబిస్తూ క్రీడలు అందుకు దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి మైదానంలో ఒక అరగంటైనా ఆడుకోవాలన్నారు. తాను ప్రయాణంలో కూడా యోగా, ప్రాణాయామం కొనసాగిస్తానని చెప్పారు.

## దేశాన్ని తీర్చిదిద్దటానికి

# యువత నడుం బిగించాలి

### సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**రేపల్లె:** భారతదేశాన్ని గొప్ప దేశంగా తీర్చిదిద్దటానికి యువత నడుం బిగించాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తుకు విద్యా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మ విశ్వాసం, ధృఢసంకల్పంతో దేశ ఔన్నత్యానికి పనికి వచ్చేలా ముందుకు పయనించాలని కోరారు. ప్రస్తుత తరుణంలో నీతి,నిజాయితీకి విలువలు లేవని, యువతలో మార్పు వస్తేనే విలువలతో కూడిన దేశంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ముందు తల్లిదండ్రులు, తర్వాత గురువుల పట్ల ప్రేమాభిమానంతో వ్యవహరించాలని, మంచి స్నేహం, పుస్తకాలు చదవటం వల్ల ఈ నాలుగు లక్షణాలు ఆచరణలో పెడితే విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరే అవకాశం వుంటుందన్నారు. గురువులు కూడా విద్యార్థుల చదువుతోపాటు దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచే విధంగా నీతి నిజాయితీలు పెంపొందించే విధంగా జ్ఞానాన్ని అందించాలని సూచించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు కోటి రూపాయలు ముందు పెట్టినా నావి కావంటూ ముందుకు వెళ్ళిననాడే దేశం పురోగాభివృద్ధి చెందుతుందన్నారు.



విద్యార్థులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న లక్ష్మీనారాయణ

అనంతరం జేడీ లక్ష్మీనారాయణను ఎంసీఏ బృందం ఘనంగా సన్మానించింది. జేడీ లక్ష్మీనారాయణ మిత్రుడు, అమెరికాకు చెందిన కొత్తపల్లి పార్థసారథి, డాక్టర్ హరిణి ఎంసీఏకు లక్ష రూపాయలు చెక్కును విరాళంగా లక్ష్మీనారాయణ చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో ఎంసీఏ అధ్యక్షులు డాక్టర్ వాసుదేవ రావు, రిటైర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ జాలాది వెంకట సుబ్బయ్య, నార్ల చంద్రశేఖర్‌రావు, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ప్రభాకర్‌రావు, డాక్టర్ ప్రకాశరావు, వేజళ్ళ కృష్ణమోహన్, పి.నాగభూషణం, మైనేని రత్నప్రసాద్, ప్రభల సుబ్రహ్మణ్యం, పి.రవిబాబు, సీవి సూర్యనారాయణరెడ్డి, ఎస్‌వి ఏ.వి బ్రహ్మం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించా

**బాపట్ల:** వరంగల్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి 1986వ సంవత్సరంలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్నేహితులు రామకృష్ణ, చక్రవర్తిలతో కలిసి మాయాబజార్‌లోని ఓ రూమ్‌లో ఉంటూ ప్రతిరోజు చెక్కరి క్లాస్ పై కళాశాలకు వచ్చేవాడినని చెప్పారు. కళాశాల ఎదురు పూరిపాకలో వుండే రంగయ్య హోటల్‌లో టిఫిన్ చేసేవాడినని తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ఉద్యోగం ఇచ్చిన ముప్పలనేని శేషగిరి రావు దగ్గర మొదటి జీతం తీసుకుని తన కెరీర్‌ను ప్రారంభించానన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ కె. లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ముప్పలనేని శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు టి. రామకృష్ణ, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, కోశాధికారి పి. సాంబశివరావు, ప్రిన్సిపాల్ వై. సుధీర్‌బాబు, ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు ముప్పలనేని శ్రీనివాసరావు, కొల్లా వీరయ్యచౌదరి, డాక్టర్ కేవీఎస్ ఆచార్య పాల్గొన్నారు.

గుంటూరు
బుధవారం,
26 జూన్
2013